

# సుమ చెప్పింది

బత్తుల వెంకట దుర్గా ప్రసాదరావు

“పెళ్లి అంటే భయంగా ఉందే...” అన్నాను.

సుమ మాట్లాడలేదు.

“ఏం” అంది భాను.

మేము ముగ్గురం స్నేహితురాళ్లం. బి.ఏ. పట్టాలు పుచ్చుకున్నాం. పెళ్లిళ్లకు సిద్ధపర్చబడు

తున్నాం. రేపు నాకు పెళ్లిచూపులు.

"ఎందర్నో చూసాను... ఏడు అడుగుల తర్వాత పూలతీగ నుండి వేరు చేయబడ్డ పువ్వుల్లా వాడిపోతున్నారు ఆడపిల్లలు" అన్నాను.

"అవును... తాళితో వలసపోతున్నట్టుగా అనిపిస్తోంది" అంది భాను.

"నువ్వు ఏమంటావే?" అడిగాను సుమని.

"మాట్లాడుతున్నారుగా... కానీయండి" అంది సుమ.

అది ఎప్పుడూ నిదానమే. దానికి చలాకీ తక్కువ.

"అదేమిటో... పెళ్లితో మన మీద అత్తగారు అధికారం చలాయిస్తారు" అంటున్న భానుకి అడ్డుపడి...

"అత్తగారు కాదు అత్తవారు..." అన్నాను విసురుగా.

"అవునవును... ఆ ఇంటివారంతా" అంది భాను.

"అలాగే... అధికారం కాదు, 'హక్కు'లా ప్రవర్తిస్తారు" అన్నాను.

"అవునవును..." తలాడించింది భాను.

"మనం ఊరకనే వెళ్తున్నామా? లాంఛనాలని, అవని, ఇవని పెద్ద ప్రోగే సమర్పించుకొని వెళ్తాం. అయినా ఇంకా వాళ్లు దాస్టికం ప్రదర్శిస్తారు... ఎందుకో? ఏమిటో!" అన్నాను.

"కొనుక్కున్న వస్తువుపై కొనుగోలుదారుకు 'హక్కు' వుంటుంది ఎక్కడైనా. కానీ ఇక్కడ అమ్మేసుకున్నవారు బోరలు విరుస్తారు. ఇదేం న్యాయం?" అంది భాను.

"అమ్మేయబడ్డవాడు మరీనూ... తెగ బరితెగిస్తుంటాడు" అన్నాను రోషంగా.

అప్పుడే అమ్మ కాఫీ కప్పులతో వచ్చింది. ట్రేని టీపాయ్ మీద పెట్టి, "త్వరగా తెమిలి బ్యూటీ పార్లర్‌కి వెళ్లు స్నేహా" అంది నాతో.

"అలాగేలే..." అనేసాను విసుగ్గా, విసురుగా.

"కాస్త పొందికగా మాట్లాడు. ఇక్కడ అయితే చెల్లుతుంది. రేపు అక్కడ ఇలా అయితే, మమ్మల్ని ఆడిపోస్తారు" అంటూ అమ్మ లోపలికి వెళ్లిపోయింది.

"విన్నావా? ఏమిటో ఈ పాఠాలు!" అన్నాను.

"అవునే, అక్కడ చోటుని 'సుప్రీమ్'గా తేలుస్తారు. ఛ..." అసహనంగా కదిలింది భాను. ముగ్గురం కాఫీ కప్పులు అందుకున్నాం. సుమ మమ్మల్నే చూస్తోంది. మా మాటల్ని వింటోంది. మేము అది మా మధ్య లేనట్టే మాట్లాడుకుంటున్నాం.

"సునీత విషయం చూడు... పుట్టింటికి రావాలంటే, అత్తగారి అనుమతి కూడా తీసుకోవాలట" అన్నాను.

"అవునే... మొగుడుతో చెబితే చాలదా? ఎక్కడో ఉన్న అత్తగారినీ అడగాలట. ఏమిటో ఈ తీరు! సునీత అనే కాదు... చాలా మటుకు అందరూ ఇంతేనే..." చెప్పింది భాను.

"ఏం చేస్తాం? తల్చుకుంటేనే భయంగా ఉంది" అన్నాను దిగులుగా.

భాను ఏమీ మాట్లాడలేదు.

ఖాళీ కప్పుల ట్రే తీసుకొని లేస్తూ, "మనం బ్యూటీ పార్లర్‌కి వెళ్లివద్దామే" అన్నాను యాంత్రికంగా.

వంటగదిలోకి వెళ్లాను. అమ్మనడిగి డబ్బులు తీసుకున్నాను.

బయటకు కదులుతూ, "అమ్మా, పార్లర్‌కి వెళ్లి వస్తాను" చెప్పాను.

"జాగ్రత్త" అంది అమ్మ.

మేము వీధిలో నడుస్తున్నాం.

సుమ – "మనం ఎక్కడికైనా 'చెప్పే' కదులుతాం. అది పద్ధతి. దానిని 'అక్కడ' కూడా కొనసాగించాలే తప్ప, 'అక్కడ' దాన్నో తప్పుగా చూడకూడదే" అంది సడన్‌గా.

"ఇక్కడిది వేరు. 'అక్కడ' ఆరాలట... ఆంక్షలట..." అన్నాను.

"ఈ 'ట' కబుర్లు వదిలి చూద్దామే..." అంది సుమ.

"అలాగా? 'నిప్పు పట్టుకుంటే కాలుతుంద'ట... నమ్ముతామా? లేక పట్టి చూస్తామా!" అన్నాను చిరాకుగా.

సుమ మాట్లాడలేదు.

భాను నవ్వింది.

మేము నడుస్తున్నాం. ఎండ జాస్తీగా ఉంది. రోడ్డు రద్దీ పల్చగా ఉంది. పార్లర్ వరకూ ఏమీ మాట్లాడలేదు మేము.

పార్లర్‌లో నా పనికి గంట పట్టింది. తిరిగి మేము ఇంటికి వస్తున్నాం. దార్లో సుమ – "సంకోచాలు వీడాలే..." అంది క్లుప్తంగా.

"సర్దుకు పోవాలంటావా? తప్పదు... అనుభవించాలి అంటావా?" అడిగాను.

"ఎన్ననుకున్నా పెళ్లిని కాదనుకోగలమా?" అడిగింది వెంటనే.

"ఎదిరించి సరిదిద్దితే తప్పా?" అంది భాను.

"తప్పులేదు. కానీ ఆలోచించు – సాధించగలమా? పైగా మనల్ని సమర్థించేవాళ్లు... ఎంతమంది ఉంటారు...?" అంది సుమ.

"ముందు పడితేగా అది తెలిసేది?" అన్నాను.

"బాగుందే... మన ముందు ఎంతమందికి పెళ్లిళ్లు కాలేదు? వాళ్లకూ పెళ్లి ముందు మనకి తెలిసినవి తెలియవా? వాళ్లలో ఒక్కరు ముందు పడి..."

ఇల్లు వచ్చేసింది. మా సంభాషణ ఆగిపోయింది. లోనికి వెళ్లాం.

అమ్మ నన్ను ఎగాదిగా చూసింది.

"నీడపట్టునే ఉండు. రేపటి తంతు సాఫీగా సాగిపోతే అదే చాలు" అంది నాతో – వంటగదిలోకి వెళ్తూ.

"రేపు వస్తానే" అంది సుమ.

"వెళ్లిపోతావా?" అడిగాను.

"పరిష్కారమేమిటే?" భాను అడిగింది.

"ఆత్మ న్యూనత స్థానంలో ఆత్మవిశ్వాసం నింపి ముందుకు పోదాం. పుట్టింట ప్రేమానురాగాలను మెట్టింటా చూపుదాం... ఆశిద్దాం. చేయికిచేయి కలవందే చప్పుడు లేదు... రాదు" సుమ చెప్పింది.

సుమ వెళ్లిపోయింది. భానూ వెళ్లిపోయింది.

* * *

పెళ్లి చూపులు పూర్తయ్యాయి. సంబంధం కుదిరింది. నాకు పెళ్లయింది.

నా 'పెళ్లి పుస్తకం' తెరుచుకుంది.

* * *

సుమ చెప్పింది అక్షరాలా నిజమవుతోంది – నా 'పెళ్లి పుస్తకం'లో తిరగబడుతున్న ప్రతి పుటలోనూ... ఆమె చెప్పినట్టు నడుచుకుపోతూంటే.

* * *

భాను ఫోన్ చేసిన ప్రతిసారీ తప్పక అంటుంది. "మనం సుమకు 'థాంక్స్' కంటే ఏమీ ఇచ్చుకోలేకపోతున్నామే..." అని.